కథానిక:

# చిట్టిబాబు

●

శ్రీ ఆకుండి నారాయణమూర్తి

తడబడుతున్న కాళ్లతో అమ్మ మంచం దగ్గరకు వచ్చి, మెల్లగా మంచంమీది కెగబ్రాకి అమ్మ తలదగ్గర కూర్చొని "అమ్మా!" అని అమాయకంగా పిల్చేడు చిట్టిబాబు. మొదటి పిలుపు కామెకు తెలివి రాలేదు. రెండోమారు పిలిచేసరికి మెల్లగా కళ్లు విప్పి, చిట్టిబాబు వేపు చూచి కళ్లంట నీరు కార్చిందా మాతృశ్రీ!...కొడుకుని హృదయానికి హత్తుకుని—"ఇవాళ...అన్నం...తి...న్నావా, నాయినా?" అనడిగింది ఎంతో ఆయాసంతో.

—"ఊహూఁ...ఒత్తి కందిగుండా అన్నం తినేయమంది వదిన. నాకక్కర్లేదని చెప్పేసేను." అన్నాడు చిట్టిబాబు కోపంగా మూతిపెట్టి.

"అలా వదినను అల్లగి పెట్టొచ్చా?......తప్పు కదూ? ఏం పెడితే అది తినేయాలి. నా జబ్బు...పోయేక..." ఆయాసం ఎక్కువవడంచేత మధ్యలోనే ఆపేసిందా వాక్యాన్ని.

అంతల్లో కామాక్షి అక్కడకు వచ్చి—"ఔనురా చిట్టిబాబూ అన్నం తినడానికలిగి ఇక్కడ కొచ్చి అమ్మను లేపేశావుట్రా?" అంది.

కోడలు వేపు చూచింది అన్నపూర్ణ. -"ఔనే, కామాక్షీ!...వాడికి కందిగుండా అన్నం అక్కర్లేదులే!...పోనీ అటకమీది కెక్కి రెండు అప్పడాలు తీసి కాల్చమ్మా!" అంది.

"అమ్మా!...వదినేం, అప్పడాలు కాలుస్తానని మొదట అంటే, అక్కయ్యేం 'ఇప్పుడెందుకూ, వెధవకి మరేం పనిలేదు...ఆకలేస్తే వాడే తింటాడులే!'...అని అందే!" అని చిట్టిబాబు తప్పంతా అక్కయ్యదే అన్నట్లు బుజువుచేస్తూ అమ్మతో చెప్పేడు.

తమ్ముడు తనమీద అమ్మతో చేస్తున్న రిపోర్టు నంతటినీ గదిలోంచి వింటున్న రమణమ్మ బయటకు వచ్చి,—"ఒసే అమ్మా!...ఈ తమ్ముడి పెంకితనం రోజురోజుకీ మరీ హెచ్చయిపోతున్నదే!—నా కొడుకూ వదిన కొడుకూ వాడికన్నా చిన్నవాళ్లయినప్పటికీ, ఏ పెంకితనం చెయ్యకుండా అన్నం తినేస్తూఉంటే వీడొక్కడికేనా వచ్చింది లోపం?! ప్రతీరోజూ అన్నాలదగ్గర తగువే! ఏమయినా అంటే అలుగుతాడు. నీదగ్గరి కొచ్చి కూర్చుంటాడు. నీకీ జబ్బు వచ్చిన పదిహేను రోజులనుంచీ ఇంతే నే అమ్మా. ముద్దు లావయిపోబట్టి—వెధవ పెంకితనం వాడూనూ!...మా పంతులు గాడు చక్కా బుద్ధిగా అన్నం తినేస్తూ ఆడుకుంటూ ఉంటాడు." అంటూ తన కొడుకు నెత్తుకొని ముద్దులాడుతూ, తమ్ముడి పెంకితనాన్ని అమ్మముందు వ్యక్తపరిచింది రమణమ్మ.

"ఏదో చిన్న పిల్లడు. తెలీక పెంకితనం చేస్తున్నాడు. నా జబ్బు తగ్గేవరకూ వాడి నేమీ అనకండమ్మా... నేనిలా మంచం పట్టేనని అసలే బెంగతో ఉన్నాడు. చూసేరా, ఎలా ఎండిపోయేడో!" అని కొడుకు తలను నిమురుతూ కన్నీళ్లు కార్చింది అన్నపూర్ణ.

అత్తగారి కళ్లంట కారే కన్నీరుగుని చూచింది కామాక్షి. ఆమె హృదయం బాధతో దడదడ కొట్టుకుంది. చిట్టిబాబుని మంచంమీంచి దింపి, "దా నాయినా, మంచి పోద్యం ఇస్తాను." అనంటూ వంటింటి వేపు తీసుకుపోయింది కామాక్షి.

"అంతలా ముద్దు చేస్తే, మొద్దు వెధవలాతయారవుతాడు." అని గొణుక్కుంది. రమణమ్మ—

—"మాడు రమణా!...అసలే వాడు నాగురించి బెంగ పెట్టుకొని ఉన్నాడు. ఇక వాడి మీద కూకలేస్తే మరీ బెంగ పెట్టుకుంటాడు. ఇవాల్టికి పదిహేను రోజులయింది. ఇంకొక్క ఆరు రోజులలోనే గదా డాక్టరన్న ఇరవై ఒక్కరోజులూ..."

అని మాత్రం అన గలిగింది అన్నపూర్ణ. ఊపిరందక పోడంచేత ఆ, ఆఖరి మాటల్ని మనస్సులోనే గొణిగేసుకుంది. వాటంతటవే కళ్లు బరువెక్కాయి. రవణమ్మ ఏదో పణిగిందిగానీ ఆమాట లేవీ స్పష్టంగా వినిపించ లేదన్నపూర్ణకు.

అన్నపూర్ణమనస్సు దానంతటదే చిట్టిబాబు భవిష్యత్తు గురించాలోచనలో పడింది—చిట్టిబాబుకు ముందు పుట్టిన ఆ ఇద్దరు పిల్లలూ ఐదేళ్లవరకూ బ్రతికి ఆ తరువాత తనను దుఃఖ సముద్రంలో ముంచి మరో లోకానికి వెళ్ళి పోయేరు. ఇక ఈమారు సుమారుగా అవయస్సులోనే ఉన్న చిట్టిబాబును విడిచి తనే మరో లోకానికి వెళిపోవలిసి వస్తుందా? ఆవిషయం తల్చుకోనేసరికి ఆమె హృదయం దడదడ కొట్టుకుంది. నిజంగా తను చచ్చిపోతే చిట్టిబాబు గతేమిటి?...వాడిని సరిగ్గా చూచే వాళ్లెవరు?... పాపం, తండ్రిని ఎరగే ఎరగడు. వాడు పుట్టిన నెల రోజుల్లోనే కదా ఆయన పోయినది!!...ఇక కూతురు రవణమ్మ చిట్టి బాబును చూస్తుందా? ఊహుఁ... లాభం లేదు !...పోనీ కోడలు తనకొడుకుతో సమానంగా చిట్టిబాబును చూస్తుందా?... పోనీ, కాస్త జ్ఞానం వచ్చిన వాడయినా తనకంతగా విచారం లేకపోయేది. బొత్తిగా జ్ఞానం లేనివాడు......ఇక ఇప్పుడే తనకీ సన్నిపాత జ్వరం రావాలా?—ఈ మందులూ, ఈ డాక్టర్లూ, ఈ బంధువులూ రావడం, వల్ల ఏమిటో అర్థంకాక ఇప్పటికే బెంగ పెట్టుకొని సగం చిక్కిపోయేడు. నిజంగా తనీ లోకంలో లేని నాడు వాడేమయి పోతాడో!..."అమ్మ ఏదీ? ఎక్కడుందని?" వాళ్లను రోజూ అడుగుతూ ఏడ్చి ఏడ్చి కృంగి కృశించి పోతాడు గాబోలు!... అప్పుడు, అక్కయ్య తనను కొట్టిందనీ, వదిన తనడిగినవి ఇవ్వలేదనీ మరెవ్వరితో ఫిర్యాదు చేస్తాడు?!—ఆవిషయాలన్నీ తల్చుకు నేసరికి ఆ అమాయిక హృదయం జలదరించింది. ఆందోళనతో కళ్లిప్పి దేముళ్ల ఫోటోల వేపు చూచింది. అందరు దేముళ్లకూ దండాలు పెట్టింది. తన జబ్బు నయమవాలని!—కానీ తన జబ్బు నయమవుతుందనే నిబ్బరం బాగాలేదామెకు. ఏదో బెంగ ఆమె హృదయానికి కవచమయింది!—చిట్టిబాబు భవిష్యత్తుగురించి అలా ఆలోచిస్తూ ఉండగానే ఏదో మైకం కమ్మినట్లయిందామెకు.

అవాళసలు అన్నపూర్ణకు ఒంటిమీద తెలివే లేదు. అదివరకు పిలచినట్లయితే పలికేది. అవాళ మరసలు పిలిచినా పలకలేదు. ఏదో చిన్న మూలుగు మాత్రం మూలిగేది. ఉండుండి అస్పష్టంగా పలవరించేది.

ఆనాటి పరిస్థితి డాక్టరుకు కూడా కొంచెం అనుమానంగా తోచింది. అన్నపూర్ణ పెద్ద కొడుకయిన శేఖరాన్ని పిలచి, "పరిస్థితి కొంచెం ఆందోళన కరంగా ఉం"దని చెప్పేడు డాక్టరు. శేఖరం డాక్టర్ని బ్రతిమాలేడు ఎలాగయినా కాపాడమని!... "సాధ్యమయినంతవరకూ ప్రయత్నిస్తా" నన్నాడు డాక్టరు.

ఆరాత్రి ప్రతీ మూడేసి గంటలకు ఒక్కొక్క ఇంజెక్షను చొప్పున ఇచ్చేడు. అలా నాలుగింజక్షనులు ఇచ్చిన తరువాత, ఓ మారు ఎనీమా చేసి, "ఇక ఆరు గంటల్లో తెలివి వస్తే మరి ఫరవాలే" దన్నాడు డాక్టరు.

అందరూ గుండెలు బిగబట్టుకుని అన్నపూర్ణ చుట్టూ కూర్చున్నారు, ఎప్పుడు తెలివి వస్తుందా అని నిరీక్షిస్తూ!—అమ్మదగ్గరకు వెళిపోతాననీ, అమ్మను నిద్రలోంచి లేపేస్తాననీ, ఒకే ఒకలా ఏడుపు మొదలెట్టేడు చిట్టిబాబు. వాడిని ఆ విషయంలోంచి మరపించి, సమాధానపరచడానికి నానా బాధా కామాక్షి పడవలిసొచ్చింది!...ఒకంతటికి గానీ ఏడుపు మానలేదు. వాడి పరిస్థితి చూస్తూ ఉంటే ఇంటందరికీ మతి పోయినట్లయింది.

తల్లిస్థితి చూచినప్పటికన్నా, తమ్ముడి ఏడుపు చూచేసరికి ప్రాణాలు పోయినట్లనిపించింది శేఖరానికి!—ఎత్తుకున్నాడు. లాలించేడు, బుజ్జగించేడు. లాభం లేకపోయింది!...వాడి ఏడుపు వినలేక పొరుగువాళ్లింటికి తీసుకెళ్లి అక్కడ వాళ్ల కప్పజెప్పింది రవణమ్మ. కొంచెంసేపయేటప్పటికి, మళ్లీ అమ్మ మంచందగ్గర కొచ్చేసి, "అమ్మా లేవే." అంటూ ఏడుపు ప్రారంభించేడు—ఇక వాడిని మరెవ్వరూ ఊరుకోపెట్టలేక పోయేరు.

డాక్టరు చెప్పినగడువు ఇక పూర్తవుతుందనగానే కళ్లువిప్పిందన్నపూర్ణ! చుట్టూ కలయ చూచింది..."అమ్మా" అంటూ శేఖరం తల్లిమంచ

దగ్గరకు పరుగెట్టి అమ్మ కళ్లల్లోకి దీనంగా చూస్తూ కూర్చున్నాడు.

అంతవరకూ తన కళ్లంట కారిన కన్నీరు తుడుచుకొని, "అమ్మా తమ్ముడింతసేపయి ఎంతలా ఏడ్చేడనుకున్నావు!" అంది రవణమ్మ తల్లి తల నిమురుతూ.

దేముడు ఫొటో లన్నిటికీ దండాలు పెట్టి, దేముడి పెట్టిదగ్గర దీపం వెలిగించి, అత్తగారి మంచం దగ్గరకు పరుగెత్తుకొని వచ్చింది కామాక్షి.

డాక్టరన్న గడువులో తెలివి వచ్చేసిందని, ఇరుగుపొరుగు వాళ్లకీ, ఇంకా ఆవీధిలో ఉన్న మరి కొందరికీ ఎలా తెలిసిందో కానీ అతిత్వరలోవచ్చి' అన్నపూర్ణ మంచం చుట్టూ మూగేసేరు.

—చిట్టిబాబును తనివితీరా ముద్దులాడి,—"వదినేదిరా...నా...య...నా!" అని అడిగిందన్నపూర్ణ హీనస్వరంతో.

"అదుగో నీ వెనకాల నిలబడిందమ్మా." అన్నాడు చిట్టిబాబు సగంమాటల్ని మింగేస్తూ.

"చూడమ్మా కామాక్షీ!...అమ్మలేని లోటు వీడికి....తీ....ర్చ....పూచీ ఇటుపైని....నీ....దేనమ్మా!..." అన్నదన్నపూర్ణ బొటబొటా కళ్లంట నీళ్లు కారుస్తూ.

అమ్మ అన్న ఆ మాటలు రవణమ్మకు కొంచెం కష్టంగాతోచేయి!...ఏం? అమ్మే ఒకప్పుడు లేని నాడు తమ్ముణ్ణి ఆమాత్రం తను పెంచలేదూ? వాడికి తల్లిలేని లోటు తను తీర్చలేదూ?...అందుకు వదినే ఉండాలా? ఆఖరికి రక్తసంబంధం కూడా లేని వదినా వాడిని ప్రేమతో పెంచగలిగేది...ఈ రకమయిన బాధ రవణమ్మకు కలిగింది. కానీ పైకి మాత్రం వ్యక్తపరచలేదు అసలు అమ్మ పరాకులో అలా అనేసుంటుంది కానీ, ఆలోచించి అనుండదనే సమాధానానికివచ్చి, కొంతవరకూ సంతుష్టి చెందింది. ఇంతకీ అమ్మ చనిపోయినప్పుడు గదా ఈ పరిస్థితి అంతా అని అనుకుంది. డాక్టరన్న గడువు లోపలనే అమ్మకు తెలివి వచ్చేసింది కనక మరి ఫరవాలేదనే ధైర్యం వచ్చేసింది రవణమ్మకు!—

—కామాక్షికి మాత్రం ఇంకా పూర్తిగా ధైర్యం రాలేదు. తన బ్రతుకుమీద తనకు ఆశ సన్నగిల్లబట్టే అన్నపూర్ణ ఆఖరున అలా చెప్పిందనుకుంది కామాక్షి. పైగా తన భర్తతో కూడా, "నాయినా... తమ్ముణ్ణి మళ్ళీ నీ అంతటి వాడిని చెయ్యి...అపోయిన...ఇద్దరిలాగా కాక..." అని కొడుకుతల నిమురుతూ వెక్కి వెక్కి ఏడ్చింది. అత్తగారు పూర్తిగా అధైర్యం చెందబట్టే అలా చెపుతున్నారని అనుకుంది కామాక్షి. ఏరకంగా ధైర్యం చెప్పాలో ఆ రకంగానూ కామాక్షీ, రవణమ్మ, శేఖరం, ఊళ్లోవాళ్ళూ ధైర్యం చెప్పేరు. కానీ ఆమె హృదయాన్ని అంటి పెట్టుకున్న అధైర్యం ఇంకా అలా వ్రేలాడుతూనే ఉంది.

ఆఖరిని మళ్ళీ చిట్టిబాబుని గట్టిగా గుండెలకు హత్తుకుంది. "వదిన చెప్పి...నట్లా..విను...అ..ల్ల..రి చే..." మరి మాట్లాడలేకపోయింది. అంతా చీకటయి పోతున్నట్లనిపించింది. ఈ ప్రపంచంతో బంధాలు క్రమంగా సడలిపోతున్నట్లనిపించింది. కళ్లు మూతలు పడ్డాయి!...డాక్ట రొచ్చేడు!—"ఇక విచారించి లాభం లేదని!" ఈ మారు పెదిమి విరిచేడు.

—డాక్టరన్న గడువులో తెలివి వచ్చేసిందని అందరూ సంతోషంతో మరి ఫరవాలేదనుకున్నారే గానీ, అది చావు తెలివన్న సంగతి అప్పట్లో ఎవ్వరూ గుర్తించలేదు.—ఇంటిల్లిపాదీ ఒక్కమారు ఘొల్లుమన్నారు. ఎందుకలా అంతా ఘొల్లుమన్నారో అర్థంకాక, చిట్టిబాబు కూడా 'కెవ్వు' మని కేకేసి ఏడవడం మొదలెట్టేడు.

తల్లి కావుకొని కూర్చున్న చిట్టిబాబును క్రిందికి దింపి, శవాన్ని నేలమీదికి దింపేస్తూఉంటే, పరుషేనా వెయ్యకుండా దింపేస్తున్నారేమిటని గోలు గోలుని ఏడ్చేడు. బాబు పరిస్థితి చూచేసరికి కామాక్షి హృదయం చెక్కలయింది. బాబు నెత్తుకొని ఊరుకో బెట్టబోయింది. కాని లాభం లేకపోయింది.

ఊళ్ళోవాళ్లంతా ఇంటి చుట్టూ మూగేసేరు. ఇల్లంతా ఏడుపులూ, మొత్తులూ! ఒక్కొక్కరూ రావడం చిట్టిబాబు నోమారు ఎత్తుకోడం—"ఎంత పని జరిగింది నాయనా!...ఇంత చిన్నప్పుడే తల్లి లేని పిల్లడిని చేసేసింది నాయినా!" అంటూ ఓమారు ముక్కు ఎగపీల్చడమూ!...ఆ మాట లేమీ అర్థంకాక బాబు మరింత గట్టిగా ఏడవడమూ!......

మరికొందరు ఏడుస్తున్న వాళ్లని ఊరుకోబెడుతూ, "ఆ పిల్లడిని చూచయినా ఊరుకోండి. పిల్లడు దద్దరిల్లి పోతున్నాడు. మీ ఏడుపులు చూచి భయపడి బెంగ పెట్టుకుంటాడు...ఎంత ఏడిస్తేమాత్రం ఇప్పుడేం లాభం?" అంటూ ఊరుకోబెట్టడం మొదలెట్టేరు.

ఆ తరువాత తల్లి శవాన్ని వాకట్లో ఆ ఎండలో ఉంచి, ఏవేవో మంత్రాలు చదువుతూ మీద నీళ్ళు జల్లుతూ ఉంటే, వదిన చంకలో గిజగిజ గింజుకుంటూ ఏడుస్తూ "అమ్మకు ఎండే,...ఎండే!" అని ఏడవడం తప్పా మరేమీ చెయ్యలేకపోయేడు చిట్టిబాబు. అక్కడకు వచ్చిన వాళ్లందరూ ఆ పిల్లడి అమాయకత్వాన్నీ, ఏడుపునీ చూచి, ఏమీ అనలేక ప్రతీ ఒక్కరూ కంటతడి పెట్టుకున్నారు. అలా ఏడ్చి ఏడ్చి నోరెండబెట్టుకొని తెలివితప్పిపోతాడేమో అని ప్రతీ ఒక్కరికీ భయం వేసింది. ఆ పిల్లడిని ఆ వీధిలో ఎవరింటికయినా తీసుకెళ్లిపొండని కొందరు సలహా ఇచ్చేరు. కానీ గుమ్మం దాటించేసరికే మరింత గోలెత్తేస్తున్నాడు. తనక్కడ లేకపోతే అమ్మను ఏం చేసేస్తారో అనే భయం ఆ లేతగుండెను పట్టుకుంది.

వెదురు బద్దలమీద తల్లి శవాన్నుంచి తాళ్ళేసి కడుతున్నప్పుడు చిట్టిబాబు పరిస్థితి దగ్గరుండి చూడవలిసిందే గానీ, రాసి లాభం లేదు!

ఆనాడు చిట్టిబాబు చేసిన హంగామా కామాక్షి తన జీవితంలో మరువలేని దృశ్యమయింది. ఆమె హృదయంలో జాలికోశం ఉన్న స్థలంలో చిట్టిబాబా నాడు ప్రవేశించేడు. బాబుకు తల్లి లేని లోటు తీర్చాలనీ, ఇక బాబు తల్లిని మరచిపోయి తననే తల్లి అనుకొనేటట్లు చేయాలనీ కామాక్షి సంకల్పించుకుందా రోజున!......

వాళ్లు అన్నపూర్ణశవాన్ని భుజాలమీదికెత్తుకుని తీసుకెళిపోతూ ఉంటే "అమ్మను ఎక్కడికి తీసికెళిపోతున్నారు? నేనూ అమ్మతో పోతాను" అంటూ వదినను గిల్లి కొట్టి, గిజగిజగింజుకొని, ఆమె చంకలోంచి దిగిపారిపోడానికి చాలా ప్రయత్నంచేసేడు. "ఎటూ లేదు నాయినా!...... పెద్దఆసుపత్రికి తీసుకెళుతున్నారు. ఇక్కడ మందులు పనికొచ్చేయి కావు, అందుకు! జబ్బుపోయిన వెంటనే అమ్మ వచ్చేస్తుందిలే!" అని చెప్పి చిట్టిబాబుని ఒప్పించబోయింది కామాక్షి. కాని వింటేనా?...వదిన అలా తనను గట్టిగా పట్టకున్నందుకు వదినమీద ఎంతయినా కోపం వచ్చింది. గిల్లేడు. కొట్టేడు. గిజగిజా గింజుకొని గట్టిగా ఏడ్చేడు!—అయితేమాత్రం? అమ్మదగ్గరకు పోడానికి అవకాశం ఇవ్వలేదొదిన!

అవాళ తనను గట్టిగా పట్టుకొని అమ్మదగ్గర కెళ్లనియ్యకపోయిన దగ్గరనుంచీ వదినంటే బాగా కోపంవచ్చేసింది చిట్టిబాబుకు. వదినంటేనే అసహ్యం పట్టకుంది. వదిన దగ్గర కెళ్లడానికే ఝడిసేవాడు. సాధారణంగా అక్కయ్యదగ్గరే ఉంటూ ఉండేవాడు. ఏం కావలిసొచ్చినా అక్కయ్యనే అడుగుతూ ఉండేవాడు.

పన్నెండురోజులూ గడిచేయి!...పరామర్శకని వచ్చిన బంధువులూ స్నేహితులూ అందరూ ఎవరింటికి వారు వెళిపోయేరు.

—"ఇక ఇక్కడ మనముండి ఏం చెయ్యాలి? ...మనం వెళిపోదాము. నా కవతల సెలవు కూడా మరిలేదు." అని రమణమ్మ భర్త అన్నాడు.

"సరే, మా తమ్ముణ్ణి కూడా తీసుకెళతానని మా అన్నయ్యనడుగుతాను" అని శేఖరాన్ని ఆ విషయమయి అడిగింది. అందుకు శేఖరం ఒప్పుకోలేదు. "అక్కడ ఇంకా తనుంటాడనే నమ్మకం లేదనీ, ట్రాన్సఫరు త్వరలోనే అవొచ్చుననీ బావ అంటున్నాడు. అంచేత ఎక్కడో ఓ దగ్గర స్థిరపడిన తరువాత తీసుకెళ్లొచ్చు" అని చెప్పి రమణమ్మ నొప్పించేడు శేఖరం.

అప్పటిమట్టుగ సరేనని ఒప్పుకుంది. కానీ మనస్సులో ఓవిషయం బాగా బాధిస్తున్నాది. తల్లి ఆఖరిదశలో, "చిట్టిబాబుని జాగర్తగా చూస్తూ, ఇటుపైని అమ్మలేని లోటువాడికి తీర్చవలిసే బాధ్యతనీదే!"నని వదినతో అంది. అక్కడికి వదినేనా మహాతనకంటే ఎక్కువ ప్రేమతో చిట్టిబాబుని చూడగలిగేది? తోబుట్టువయిన తనకంటే ఎక్కువ ప్రేమ తన తమ్మునిమీద, వదిన కెందుకుంటుంది?...అమ్మ ఏదో పరాకులో అన్నమాటలే కానీ, ఆలోచించి అన్నమాటలు కావనే నిశ్చయానికి బాగా వచ్చింది—ఇక వదిన దగ్గర ఎలానూ చి బాబుండలేడు!...ఓ పదిరోజులలోనే బెంగ పెట్టుకొని తన దగ్గర కొచ్చేస్తానంటాడు. ఆ మాత్రం

దానికోసం తను అన్నయ్యతో తగూఆడి, తమ్ముడిని అప్పుడే తప్పనిసరిగా తీసుకొని వెళ్ళగలిగేటంతటి శ్రమ ఎందుకు?—ఏదో అప్పటి మట్టుగ 'ఊఁ' అని అందే కానీ, నిజానికి తనకొడుకుతో సమానంగా చిట్టిబాబునెందుకు చూస్తుందొదిన? అసలువాడు వదినదగ్గరెలానూ ఉండడు. వదినవాడినెలానూ ఉంచుకోదు!...ఏదో,ఓ పదిరోజుల ముచ్చట. ఆ తరువాత వాడు బెంగపెట్టుకుంటే ఎలానూ పంపించేస్తారు. ఇక అన్నయ్యకు వాడిమీద వాత్సల్యం ఉండడం సహజం!...కానీ ఎంత వాత్సల్యం ఉన్నప్పటికీ ఆడదానిలా వాడిని లాలిస్తూ బుజ్జగిస్తూ ప్రొద్దస్తమానం కాలక్షేపం చెయ్యలేడుకదా!....మహా చెయ్యగలిస్తే వాడిని జాగ్రత్తగా చూడమని వదినకు ఆర్డరు వేస్తాడు. ఏదోవాడిని మహా ప్రేమతో చూస్తున్నట్లు అన్నయ్య దగ్గర ఓమారు నటిస్తుందొదిన!...అంతే! ...అభిమానం వాత్సల్యం అనేవి హృదయంలో ఉండాలిగానీ, కోరి నటించటంకోసం తెచ్చిపెట్టుకుంటే వస్తాయా?!...ఏమయినాసరే అమ్మలేని లోటు వదిన మాత్రం తీర్చలేదనే నిశ్చయానికి వచ్చింది రమణమ్మ. ఇక ఆ పని కాస్తా తనవల్లే నెరవేరుతుందనే గర్వం రమణమ్మ మనస్సులో బాగా ఉంది.

చిట్టిబాబును సరిగ్గా వదిన చూడలేకపోయిందని లోకం గ్రహించిన తరువాతే, తను తమ్ముణ్ణి తీసుకెళ్ళవచ్చుననే నిశ్చయానికి వచ్చి ప్రయాణానికి సిద్ధమయింది.

రమణమ్మ స్టేషను కెళ్ళడానికి బండీ ఎక్కుతున్నప్పుడు, "నేనూ అక్కయ్యతో వెళిపోతా"ననుకుంటూ చాలా గోలచేసి ఏడ్చేడు చిట్టిబాబు. తమ్ముడు అలా తనగురించి ఏడవడం, ఓరకంగా సంతోషమే అనిపించింది రమణమ్మకు!...ఇరుగుపొరుగువాళ్ళు చూచి, "ఓహో! అక్కయ్య అంటే చిట్టిబాబు కెంత అభిమానమో!" అని వాళ్ళలో వాళ్ళనుకుంటారని, రమణమ్మకు మనస్సులో గర్వం. ఇరుగుపొరుగువాళ్ళలానే అనుకున్నారు!!......

* * *

సహజంగా ఆ కుటుంబంలో ఉన్న సంఖ్యలో ఓటి తగ్గడంచేత, పరామర్శకని వచ్చినవాళ్ళంతా వెళ్ళిపోడంచేత, ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్ద వాతావరణం చిట్టిబాబుకేమీ రుచించలేదు సరిగదా, ఏదో భయాన్ని కూడా కలుగజేసింది. అసలే అమ్మ ఏమయిందో, ఎక్కడుందో తెలికపోడంచేత ఆ అమాయక హృదయం బెంగతోనిండి ఉంది. ఇక అక్కయ్యకూడా తనను వదినదగ్గర విడిచిపెట్టి వెళ్ళిపోయింది. దాని కంతటికీ కారణం వదినేయేమో అని ఆలేతగుండె అభిప్రాయం!...అంనేత వదిన వేపు చూడ్డానికే దడుసుకొనేవాడు. వదిన తనను రమ్మనమని ముద్దుగా పిలిచినా వెళ్ళడానికి జంకేవాడు. వదిన అన్నం పెడితే తినేవాడుకాదు. అన్నయ్యవచ్చి అన్నం కలిపి పెడితే ఓపిడికెడు మెతుకులు తినేవాడు. అంతే!...ఎప్పుడూ దిగులుతో మతిపోయినవాడిలా ఆమూలా ఈమూలా ఒదిగేవాడు.

వాడినేమీ అనకుండా, లాలిస్తూ, బుజ్జగిస్తూ వాడు కోరినవన్నీ ఇస్తూ మంచి మంచికథలు చెపుతూ తనంటేవాడికి భయంలేకుండా ఉండేటట్లు చేసుకుంది కామాక్షి!...క్రమంగా ఓ పదిహేను రోజులయేసరికి వదిన దగ్గర కాస్తా చనువు కుదిరింది చిట్టిబాబుకి—ఒక్కొక్కప్పుడు వాడు అమ్మగురించడిగేసరికి, వాడిని ఆవిషయంలోంచి మరిపిస్తూ వాడి మనస్సును మరోవిషయంలోకి నేర్పుతో త్రిప్పేసేది.

ఎంతో ముద్దుగా చూడ్డంచేత, అతి చనువేర్పడింది వదినదగ్గర. ఫలితంగా విపరీతమయిన పెంకితనం చేసేవాడు—ఓనాటి మధ్యాహ్నం కామాక్షి నట్టింటిలో పడుక్కొని తన కొడుకు రామానికి పాలిస్తూ ఉంటే, చిట్టిబాబు వెనకనుంచి వెళ్ళి వదిన చీరె కటికపుల్లతో అంటించేసి, "వదినా...నీ చీరకు బలేమంట...టా...టా..." అని గెంతడం మొదలెట్టేడు. ఇంకా పూర్తిగా అంటుకోకపోడంచేత ఎలానో తనంతట తానే ఆర్పేసుకోగలిగింది కామాక్షి!...ఆక్షణంలో చిట్టిబాబుని రెండుదెబ్బలు చీపురుతో వెయ్యాలనిపించింది. కానీ తల్లిలేని పిల్లడన్న సంగతి జ్ఞాపకంవచ్చింది. గట్టిగా వాడిని మందలిస్తే ఏంబెంగ పెట్టుకుంటాడో అని ఏమీ అనలేదు. "తప్పుకదూ?...అలా నిప్పుతో ఆడకూడదు నాయినా?" అని మాత్రం అంది. ఆ

మాత్రంమాట అన్నందుకే ఇట్టే మూతి పెట్టేసి, బెంచీ వార కెళిపోయి. అలిగి కూర్చున్నాడు.

ఆ సాయంత్రం శేఖరం ఇంటికి వచ్చి, పరుపు మీద ఉన్న కాలిన చీరెను చూచేడు. ఎలా అది కాలిందో ఆ సంగతంతా భార్యనడిగి తెలుసుకున్నాడు—ఏరా, చిట్టిగా! రాస్కెల్ నిప్పుతోనా నీ ఆటలు" అంటూ ఛళ్, ఛళ్ మని రెండు లెంపకాయలు కొట్టేడు,కొట్టొద్దని కామాక్షి అడ్డుకుంటుంన్నప్పటికీ!...

...ఏడ్చిఏడ్చి పడుక్కున్న తమ్ముడు నిద్దట్లో కూడా అలా బెక్కుతూనే ఉండడం చూచేడు శేఖరం!—నిద్దట్లోక్కూడా బెక్కేలా ఏడ్పించినందుకు తనను తానే నిందించుకున్నాడు. శేఖరం. ఒక వేళ అమ్మ బ్రతికుంటే వాడినంతలా కొట్టనిస్తుందీ?...అలా వాడిని కొట్టడానికి తనకు మాత్రం స్వతంత్రం ఉంటుందా?...ఇక ముందెప్పుడూ అలాకొట్టకూడదని నిశ్చయించుకున్నాడు.

తనలా భర్తతో నిజం చెప్పడమే పొరపాటనుకుంది కామాక్షి. ఏదో తన అశ్రద్ధచేతే చీర కాలిపోయిందనేస్తే పూచీ లేకపోయేదిగా!—ఏడుపు ముఖంతో మధ్య మధ్య బెక్కుతూ పడుక్కున్న బాబుని చూచేసరికి ఆమెకళ్లు నీళ్లతోనిండి పోయేయి. తెలీక చేసినపనిగానీ, తెలిసి చేసేడా ఆపని చిట్టిబాబు? ఆ మాత్రందానికోసం అంత గట్టిగా కొట్టడానికి తన భర్తకుమాత్రం ఎలా ఒచ్చాయో చేతులు?...అని ఏమేమో సమాధానాలు లేని ప్రశ్నలు వేసుకుంటూ ఆరాత్రి గడిపింది కామాక్షి!...

ఆ మర్నాటినుంచీ మళ్లీ మామూళ్లలు పెంకితనంలోకి దిగేడు చిట్టిబాబు. తల్లి బ్రతికుండేటప్పుడు ఏదయినా పెంకితనం చేస్తే కసిరి మంద లిస్తూ ఉండేది. ఇప్పుడు తల్లిలేని పిల్లడవడంచేత కసిరి మందలిస్తే ఏంబెంగ పెట్టుకుంటాడో అని, ఎంత పెంకితనం చేసినా ఏమీ అనకపోడంచేత, చిట్టిబాబు చేసే పెంకితనం మరీ విపరీతమయింది.

తమ్ముడుచేసే పెంకితనం మరీ విపరీత మయినప్పుడు శేఖరం మాత్రం అప్పుడప్పుడు కేకలు వేసేవాడు. కానీ వదిన తాలూకుదన్ను తనకు బాగా ఉండడంచేత అన్నయ్య వేసే కేకలను లెక్క పెట్టేవాడు కాదు!...ఫలితంగా చిట్టిబాబు చేసే పెంకితనానికి హద్దులు లేకపోయేయి!...

...ప్రతీ వస్తువూ నూతులో పడేయడం—గాజుసామానులూ అవీ బ్రద్దలకొట్టడం—అన్నయ్య కొడుకు రామాన్ని కొట్టి ఏడిపించడం—ఈరకంగా అల్లరిపనులు చేసేవాడు.

ఒకమారు మహా విపరీతమయిన పెంకితనం చేసేడు. అన్నయ్య ప్రతిరోజూ ఉదయాన్నే చలి కాగడంకోసం, పసువులు తినగా వదిలేసిన గడ్డి కూడదీసి మంట వేస్తూ ఉండడాన్ని జాగర్తగా పరిశీలించేడు. తనకీ మంట వెయ్యాలని బుద్ధిపుట్టింది. గడ్డి కూడదీసి ప్రత్యేకించి మంటవేస్తే పెద్దమంటవదని, సరాసరి గడ్డికుప్పున్న సాలలోకే వెళిపోయి కుప్పను అంటించేడు. చిన్నమంట మండుతున్నప్పుడు ఏమంత సంతోషాన్ని చెందలేదు బాబు! అది భగభగామండి సాలకూడా పూర్తిగా అంటుకోనేసరికి, భయం, ఆశ్చర్యం, సంతోషం అన్ని కలిగేయి చిట్టిబాబుకు. ఊళ్ళోవాళ్లంతా ఆత్రుతతో పరిగెట్టి అక్కడకు వచ్చేసరికి,—"అన్నయ్య ఎప్పుడేనా వేసేడా ఇంత పెద్దమంట!...నేనుటా...టా...టా..." అని గెంతుతున్నాడు.

ఆవాసంతా కాలిపోతేనేగానీ ఆర్పలేకపోయేరు.

అంతమందికి నష్టంకలిగించిన చిట్టిబాబుమీద ఆ ఊరువాళ్లందరికీ అసహ్యం, కోపం రెండూ వచ్చేయి. "ఎంత చిన్నపిల్లడయితే మాత్రం ఇలాంటి పనులు టండీ!...ఊళ్ళో ఎందరు చిన్నపిల్లలు లేరు!..." అని కొందరూ—"ఎంత కరణంగారయినా, తమ్ముణ్ణి సరిఅయిన అదుపాజ్ఞలలో ఉంచొద్దుటండీ!" అని కొందరూ—"తల్లి బ్రతికుండేటప్పుడు ఇలాంటి పను లెరగడండీ!...వాడినీ రకంగా తయారుచేస్తున్నదా కామాక్షేనుసుమండీ!" అని కొందరూ—"వాడి కేదో మందు పెట్టి వాడి మతి విరిచేసిందండీ! లేకపోతే ఇలాంటి పనులు చేస్తాడా? ఆ రవణమ్మ వీడి నిక్కడ వదిలేడం తెలివితక్కువపనే చేసిందని" కొందరూ, ఈరకంగా వాళ్ళిష్టం వచ్చిన ట్లనడం మొదలెట్టేరా ఊళ్లోవాళ్లు.

లోకులనే మాటల్ని భరించలేక శేఖరం తమ్ముణ్ణి తట్లు తేరేలా రివకతో కొట్టేడు. అలా కొడుతున్నప్పుడు అడ్డుకోబోయి తనూ కొన్ని దెబ్బలు తింది కామాక్షి. ఇంకా కొట్టబోయేడు కానీ అంతవరకూ మొఱ్ఱోమని గట్టిగా ఏడ్చిన చిట్టిబాబు ఒక్కమారుగా ఊరుకోడంచేత తెలివితప్పిపోయేడని గ్రహించి శాంతించేడు. కామాక్షి కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. ఆవేళలో సహానశక్తి పట్టుతప్పింది. శేఖరం తనభర్త అన్నసంగతి అప్పుడు మరచిపోయింది. గొంతు కంతటినీ విప్పి, "మనిషివా, పశువ్వా?" అని నీళ్ళతోనిండిన ఎఱ్ఱటికళ్లను పెద్దవి

చేసి అడిగింది. మళ్లీ అంది—"లోకాన్ని మెప్పించడానికికదూ వాడిని కొట్టేరు?...ఈ పాడువెధవల మెప్పు పొందడానికేనా వాడి నంతలా కొట్టేరు?... ఈ వెధవల ఇళ్లు కాలితే వచ్చిన నష్టమేమిటి?... బ్లేకుమార్కెట్లులో వచ్చిన డబ్బుతో కట్టిన ఇళ్లేగా?... ఇళ్లు కాలినంతమాత్రంలో వాళ్లు శుద్ధికారు. దానితోపాటు వాళ్లూ కాలిననాడు శుద్ధవుతారు. వెధవలు! లోకజ్ఞానంలేని వెధవలు!!...ఏమీ తెలీని చిన్నపిల్లడేదో చేసేడని ఇంత రాద్ధాంతమా?..." అని ఏమేమో నానామాటలూ అంది కామాక్షి ఆ ఉక్రోషంలో!...

అంతవరకూ చిట్టిబాబుని కొడుతూ ఉంటే చూస్తూ ఊరుకొని, తీరా వాడు తెలివి తప్పిపోయేక, — "చిన్నపిల్లడు కదా, వాడికేం తెలుస్తుందని అంతలా కొట్టడం?!...బుద్ధిలేకపోతేసరి!" అని అప్పుడు శేఖరాన్ని చీవాట్లేసేరు లోకులు!!...

కానీ మరో విచిత్ర మేమిటీ అంటే, "చిట్టిబాబుని ఆ రకంగా వెఱ్ఱివాడిలా తయారుచేస్తున్నది కామాక్షే అనీ, నిజాని కామెకు చిట్టిబాబుమీద అభిమానం లేనే లేదనీ, వాడిని ఈరకంగా చిన్నప్పటి నుంచీ బుద్ధిలేనివాడిగా తయారుచేసి, పెద్దయేసరికి ఓ పిచ్చివాడి ఆకృతివాడికి తెప్పించడమే ఆమె లక్ష్యమనీ, చిట్టిబాబుమీద ఎంతో ప్రేమ ఉన్నట్లు నటించుతూ, వాడి పేరుతో కొన్న ఓవల్టిన్ డబ్బాలూ అవీ తన కొడుకు గుఱించి వినియోగించుకుంటున్నాదనీ, ఇప్పుడయినా రవణమ్మ వచ్చి వాడిని తీసుకెళ్లిపోతే కొంత బాగుపడతాడనీ—" ఈ రకంగా లోకులు రకరకాలుగా కామాక్షిని విమర్శించడం మొదలు పెట్టేరు.

కామాక్షి హృదయంలో తుపాను చెలరేగింది!—తను ఎంత ప్రేమతో చిట్టిబాబుని చూచుకున్నప్పటికీ లోకు లెందుకిలా అనుకుంటున్నారో అర్థమయింది కాదామెకు!...తప్పున్నా లేకపోయినా విమర్శించడమే లోకం తాలూకు లక్షణమని ఆమె తెలుసుకుంది—తను చిట్టిబాబు విషయంలో ఏం లోపం చేసింది? అని తనలో తాను ప్రశ్నించుకుంది. తనంతవరకూ ఏ లోపం చేయనట్లు అంతరాత్మ ప్రబోధిస్తున్నాది. ఇకముందెప్పుడూ తన చేతులతో తను బాబుకి హాని చెయ్యలేదు కూడా! ...బాబంటే తనకు హృదయపూర్వకమయిన వాత్సల్యం ఎలా కలిగిందో తనకే తెలీదు!—కానీ లోకులుమాత్రం తనను అపార్థం చేసుకున్నారని కామాక్షికి విచారం...

పైగా తన ఆడపడుచు రవణమ్మ నెలకు కనీసం రెండుత్తరాలకు తగ్గకుండా వెళ్లిన దగ్గరనుంచీ రాస్తున్నాది, తమ్ముణ్ణి పంపించేయమని. ఆమధ్య, ఎదురింట్లో ఉన్న నరసమ్మ తన ఆడబొట్టిఉన్న ఊరెళ్లినప్పుడు అందిటా, "మా వదినేం చూస్తుందండీ వాడిని; దాని దగ్గరుంచితే మేం వాడిని చేతులారా చంపుకున్నవాళ్ల మవుతాము" అని. ఆ మాటలు కామాక్షి హృదయాన్ని కొంతవరకూ గాయపరచేయి. అయినా కాస్త దిట్టమయిన గుండె కాబట్టి చలించలేదు. తనమీద నరసమ్మ ఏకో చెప్పుండబట్టి అలా అనుంటుందని సమాధాన పడింది. ఇంతకీ ఈ లోకుల నే మాటల్ని అంతగా మనస్సుకు పట్టించుకోదలచుకో లేదు కామాక్షి.

చిట్టిబాబలా ఇంటి దగ్గరుంటే, ఏమీ ఊసుపోక అల్లరిపనులు చేస్తున్నాడని ఆ ఊరిబడిలో ప్రవేశపెట్టేడు శేఖరం. కానీ ఆ చదువు అట్టే రోజులు సాగలేదు. బడికి పంపించుతున్న దగ్గరనుంచీ చిట్టిబా బెంచేతో నల్లగా మాడిపోడం మొదలెట్టేడు. అదీకాక అక్కడ మేష్టరు చీటికీ మాటికీ, "ఏమీరాని మొద్దువెధవా!" అంటూ కొడుతూ ఉండేవాడ —

—నిజానికి చిట్టిబాబు కూడా ఒట్టి మందమతివాడిలా ఉండేవాడు. ఏదో చెప్పినా ఏదో పరాకుగా వినేవాడు. అక్షరాలు దిద్దుతూ దిద్దుతూ చెరిపేసేవాడు. అప్పుడే విన్న విషయాన్ని ఆ వెంటనే మరచిపోయేవాడు. పైగా అల్లరిచేసేవాడు. అంచేత పంతులు రెండు చరుపులు చరిచేవాడు.

అలా కొట్టి చదువుచెప్పడంవల్ల ప్రయోజనం లేదని కామాక్షి ఉద్దేశ్యం. అందువల్ల మరింత పిల్లలు పాడయిపోతారని ఆమె తలంపు—ఓమారు ఒళ్లు కందిపోయేలా చిట్టిబాబును మేష్టరు కొట్టడంచేత, ఆ మేష్టరికి చదువుచెప్పడం రాదని, నాలుగుతిట్టి, బాబును బడికి పంపించడం మానేసి తానే స్వయంగా చదువు చెప్పడానికి పూనుకుంది.

ఈ చదువు కూడా ఎన్నాళ్లో సాగలేదు! అనుకోకుండా ఆడబొట్టి రవణమ్మ వచ్చేసింది, చిట్టిబాబుని తనతో తీసుకెళ్లి పోడానికి.

రవణమ్మ రావడంతోనే కామాక్షి హృదయంలో చెలరేగిందో పెనుగాలి. అసలు రవణమ్మ వస్తూనే, "ఇదేమిటమ్మా పిల్లడిలా పూచికపుల్లలా అయిపోయేడు!" అని తమ్ముణ్ణి ఎత్తుకొని, కామాక్షి సరిగ్గా చూడకపోవడంవల్లే అలా ఎండిపోయే డనే ధ్వని ఆ స్వరంలో ఉండేలా అంది.

ఆ మధ్యాహ్నం ఊళ్లో వాళ్లంతా ప్రోగయి, చిట్టిబాబుని కామాక్షి పాడుచేస్తున్నా దనీ, వాడినో పిచ్చివాడిలా తయారుచేస్తున్నా దనీ, ఈ రకంగా గమ్మత్తయిన కథ లల్లి రవణమ్మ ముందు వర్ణించేరు.

తమ్ముడలా పాడయిపోయేడని కామాక్షి అట్టే విచారించలేదు గానీ, కామాక్షి చిట్టిబాబుని సరిగ్గా చూడలేకపోయిందని లోకులు గ్రహించినందుకు ఓ రకంగా సంతోషించింది. ఇక తన అధీనంలో తమ్ముణ్ణి పెంచి వాడినో ఆదర్శవంతునిగా తయారుచేసి లోకం మెప్పు పొంది వదినకన్నా తనే ఘటికురాలనిపించుకుందామని రవణమ్మ ఉబలాటం.

'తమ్ముణ్ణి తీసుకెళతా' నని అన్నయ్యా నడిగింది.

"ఇప్పుడే మా తొందర!" అన్నాడు శేఖరం.

"బాగానే ఉంది. ఇలా ఈ పల్లెటూళ్ళో చదువూ సంధ్యా లేకుండా ఎన్నాళ్ళని ఉంచేస్తావు? ఇప్పటికే మొద్దు వెధవలా తయారయేడు." అంది రవణమ్మ కొంచెం స్వరం హెచ్చుచేస్తూ.

"సరే, వదిన నడిగి తీసుకెళ్ళు!" అన్నాడు శేఖరం.

"ఇంట్లో ఆడారిపెత్తనం ఏమిటి? బాగానే ఉంది. తమ్ముణ్ణి పంపించడానికి వదినెవర్రి మధ్యని!......" అంది రవణమ్మ ముఖం చిట్లించుకుంటూ.

వంటింటిలోంచి ఈ సంభాషణను మొదటి నుంచీ వింటున్న కామాక్షి బయటకు వచ్చి, "అప్పుడే వాడికేం ఈడు మించిపోయిందని చెప్పమ్మా, పట్నంలో చదివించడానికి. ఆమాత్రం నాలుగో క్లాసువరకూ చదువిక్కడా ఉందిగా. ఆ నాలుగు తరగతులూ అయిపోయేక కావలిస్తే పట్నంస్కూలులో ప్రవేశపెట్టొచ్చు." అంది కామాక్షి ఎంతో శాంతంతో.

"ఔను!...ఇంకా మరికొన్నాళ్ళు ఇక్కడ ఉంటే,-చక్కా మా తమ్ముడి పేరుతో నీ కొడుక్కి కావలసినన్ని ఓవల్టిన్ డబ్బాలూ, సిల్కు లాల్చీలున్నూ......ఇంకా, ఇంకా అన్నీని!" అని ఎత్తిపొడిచింది రవణమ్మ.

కామాక్షి మనస్సు చివుక్కుమంది. "తొందరపడి అలా అనేకమ్మా. ఇప్పుడీ రాద్ధాంతం ఎందుకూ? అంతగా తీసుకెళ్ళాలని ఉంటే తీసుకెళ్ళు......వాడెప్పుడు బెంగపెట్టుకుంటే అప్పుడు పంపించేయి." అంది మనస్సులోంచి ఉబుకుతున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

అంతట్లో చిట్టిబాబు అక్కడికి వచ్చేడు. "అక్కయ్యా మరి నే నక్కడకు వస్తే, నాకు రోజూ కాఫీ ఇస్తావా?" అని అడిగేడు అక్క చెయ్యి పట్టుకొని ప్రేళ్ళాడుతూ.

"ఎంత వాచిపోయేవో నాయినా!.....రెండు పూటలా బావతోపాటు నీకూ ఇస్తానులే!" అంది.

"కాఫీ అలవాటు వాడికి చెయ్యకమ్మా. అదేం మహా బలమయిన పదార్థమని! అది అలవాటయితే నీరసించిపోతాడనే, రోజూ నేను చల్దన్నం పెడుతున్నాను" అంది కామాక్షి.

"అందుకే ఇలా మందమతివాడిలా తయారవుతున్నాడు. వెధవ పల్లెటూరలవాట్లూ వీడూనూ!..." అంటూ బాబు నెత్తుకుంది రవణమ్మ.

చిట్టిబాబెంతో సంతోషంతో ప్రయాణమయేడు. బండీ ఎక్కుతున్నప్పుడు వదినతో అన్నాడు. "వదినా నేనీ వెధవ్వూగు మరి రాను. రావాలంటే నువ్వే అక్కడికిరా?...మా అక్కయ్య కూడా వెళ్ళొద్దని చెప్పేసింది. అన్నట్లు రామాన్ని కూడా చదువుకుందికి పంపించీ కూడదూ?" అని నవ్వుతూ అడిగేడు. చిట్టి బాబు వేపు దీనంగా చూచింది కామాక్షి. ఏదో అనబోయింది. కానీ నోరు తెరవబడలేదు. ఆమెకేదో తెలీనిభయం పట్టుకుంది—"బాబూ వెళ్ళక"ని కేకేద్దామనుకుంది కానీ... కాని...బండీ మలుపుతిరిగి వెళిపోయింది! బరువయిన హృదయంతో తన కొడుకు రామాన్ని చంకనెత్తుకొని ఇంటిలోకి వెళిపోయింది కామాక్షి.

* * *

అంతా క్రొత్తివాతావరణం, క్రొత్తపరిసరం!- అంతా వింతగా ఉంది చిట్టిబాబుకి. తను వదిన దగ్గర అల్లరిచేసినట్లే అక్కడా చేద్దామనుకొని ప్రారంభించబోయేడు. కానీ లాభం లేకపోయింది. అతి ముద్దుగా చూస్తూ, పిల్లలకు స్వేచ్ఛ ఇస్తే పాడయిపోతారని రవణమ్మ ఉద్దేశం. అంచేత తనకొడుకు పంతుల్ని చిన్నప్పటినుంచీ ఆరకం ఖాయిదాలోనే ఇంతవరకూ ఉంచింది. ఇక తమ్ముణ్ణినూడా ఆరకం ఖాయిదాలో ఉంచితేనే బాగుపడతాడని ఆమె ఉద్దేశ్యం!—

పరిసరంతోబాటు కట్టు బాట్లూ మారేయి. వచ్చిన రెండవరోజునాడు, తన మామూళ్ళలు అలవాటుప్రకారం, ఓ గాజు బొమ్మతో ఆడి, దాన్ని చితకొట్టేడు. తననుకూడా అక్కయ్య చితకొట్టింది, "మరెప్పుడూ అలా గాజుబొమ్మలతో ఆడక"అని. అప్పుడు అలాతనును అక్కయ్యకొట్టిందని ఎవరితో చెప్పుకుంటాడు?!....అమ్మా, వదినా ఇద్దరూ ఆ అమాయక హృదయంలో మెరసేరు. ఆ మాత్రం దానికోసం వాళ్ళు తనను ఎప్పుడయినా అంతలా కొట్టేరా?...ఊహుఁ!...గోడ వారకు పోయి చాల సేపు ఏడవడం తప్ప మరేమీ చెయ్య

లేక పోయేడు. పైగా అలా ఏడుస్తున్నందుకు కూడా తిట్టిందక్కయ్య.

మరో నాలుగురోజుల్లో నే, ఓ మంచిరోజున, బడిలో ప్రవేశపెట్టించింది. తమ్ముణ్ణి. ఆ బడి తన పల్లెటూరు బడిలాగే ఉంటుందనీ, తను కరణంగారి తమ్ముడని ఇక్కడకూడా తనంటే అందరికీ భయం ఉంటుందనీ,...ఇంకా ఏమేమో అనుకున్నాడు. కానీ తననుకున్నట్టు లేదా బడి. అక్కడి పిల్లలందరూ, తనకు మించే వెంకితనాన్ని చేస్తున్నారు. తను కరణం గారి తమ్ముడని అయినా భయంలేక— "పల్లెటూరు బైతు, పల్లెటూరి బైతు." అని అంటూ తనని ఏడిపించడం మొదలెట్టేరు. వాళ్లతోపాటు తన మేనల్లుడు పంతులుగాడు కూడా 'పల్లెటూరి బైతుమామా! ఓ వెఱ్ఱిమామా!" అని వాళ్లతో కలసి అంటూ తననేడిపించడానికి పూనుకున్నాడు. తను వాళ్లనేమి అనగలడు?...వాళ్లు చాలా ముందున్నారే! వాళ్లు తన కన్నా చురుగ్గా ఉండి మంచి తెలివయినవాళ్లలా ఉన్నారాయె!—ఎలా వాళ్లను తను తిరిగి అనగలడు?-ఆఖరికి ఏడవడంతప్ప మరేమీ చెయ్యలేకపోయేడు. అంతట్లో మేష్ట రొచ్చేడు. అందరూ నిలబడ్డారు. చిట్టిబాబు మాత్రం అలా బిక్క చచ్చిపోయి ఇంకా కూర్చునే ఉన్నాడు. గబగబా చిట్టిబాబుదగ్గరకు మేష్టరొచ్చి, "ఓరి వెధవా, మేష్టరొస్తే లేచి నిలబడాలని తెలీదట్రా?!" అంటూ గబగబా నాలుగు మొట్టికాయలు మొట్టేడు—"వాడో పల్లెటూరి బైతండీ!" అన్నాడో కుఱ్ఱాడు వెనకనుంచి—"ఓ! పల్లెటూరి బైతా...అందుకే గౌరవమర్యాదలు తెలీవు వెధవకి!" అన్నాడు మేష్టరు.

తను తనూరిబడిలో ఎప్పుడు, అలా లేచి నిల్చున్నాడు మేష్ట రొచ్చినప్పుడు? తనూళ్లో మేష్టరు ఈ మాత్రం చిన్నవిషయానికి కూడా కొట్టేవాడా? ఉహూఁ!...

"మరి నేనా బడికి వెళ్ల"నని ఏడుస్తూ అక్కయ్యతో చెప్పేడు చిట్టిబాబు.

"ఏం?" అని అడిగింది అక్కయ్య.

జరిగిన సంగతంతా ఏడుస్తూ చెప్పేడు చిట్టిబాబు. అంతావిని—"ఓరి వెధవా నీ వెంకితనం అంతా మనూళ్లోనేనా?....ఇక్కడ చేతనయింది కాదేం? చక్కా ఆపంతుల్ని చూడు, నీకన్నా చిన్నవాడయినా నీతో సమానంగా చదువుకుంటున్నాడు. వాడిని ఒక్కడయినా ఏమయినా అనగలుస్తున్నాడూ? అంటే పాతేస్తాడు. చక్కావాడిలా నువ్వూ ఉండాలి...ఔనట్రా మేష్టరొస్తే నిలబడవద్దట్రా!! పోనీ వాళ్లందరూ లేచి నిల్చున్నప్పుడు, వాళ్లను చూచయినా లేచి నిలుచున్నావు కావేం?.. ఆమాత్రం విషయాలుకూడా ముందుగా చెప్పాలట్రా?!" అంది రవణమ్మ.

అక్కయ్య అలా అటుందని అనుకోలేదు చిట్టిబాబు. వదినే ఉంటే అలా ఊరుకుంటుందీ. తనను అంతలా కొట్టినందుకు మేష్టర్ని నాలుగు చీవాట్లెయ్యదూ?!...ఇకముందు ఆ ఊళ్లో తనెలా ఉండగలడో అర్థమయిందికాదు చిట్టిబాబుకి!...ఆరోజు మట్టికి బాగా ఏడ్చేడు.

రోజులు గడుస్తున్నాయి—ఏదో వెంగపట్టుకుండా అమాయక హృదయానికి. ఆఖరికి తన బావగారు కూడా తనను ఏడిపించడమే!...ఏవో లెక్కలు చెయ్యమని, పంతులికీ చిట్టిబాబుకీ ఇయ్యడం!... సహజంగా చిట్టిబాబు చెయ్యలేకపోడం. "ఓరి బడ్డూఖాన్" అని ఏడిపించటం—ఈరకంగా, వివిధ పద్ధతులలో తమాషాకోసం ఏడిపించేవాడు వెంకట్రావు.

సహజంగా చిట్టిబాబు లెక్కల్లో వెనకపడి ఉన్నాడని, ప్రయోగాత్మకంగా గణితసంబంధజ్ఞానం గరుపుతే బాగా పట్టుబడుతుందనీ, పంతులతో సహా బజారుకు పంపించి కూరలూ మొదలయినవి బేరమాడి కొని ఇంటికి తీసుకురావడంలాంటి ఇటువంటిపనులు చెప్పేది. అంత చిన్నవయస్సులోనే బజారుపని చక్కగా చేయగలుగుతున్న పంతుల్ని పొగుడుతూ, తనకు చేతగాదని తిట్టడమనేది ఎంతో బాధగా తోచింది చిట్టిబాబుకి. తనూళ్ళో తనను వదిన దుకాణానికెళ్లమనీ ఏవయినా కొనమనీ ఎప్పుడు పంపించింది గనక!...

నిజానికి చిట్టిబాబుని బాధించాలనే ఉద్దేశ్యం రవణమ్మకే కోశానా లేదు. అలా తిట్టినట్లయితే, సిగ్గుపడి జాగర్తగా అన్నీ తెలుసుకుంటాడని!... చిన్నప్పటినుంచీ బజారుకు పంపించి, కావలసినవి కొని తీసుకురమ్మన్నట్లయితే, ఆ సంబంధించిన లెక్కలు బాగా తెలుస్తాయనీ, తనపని తాను చేసుకోడంవల్ల తప్పులేదనే జ్ఞానం కలుగుతుందనీ, ఆ రకమయిన పనులు చేయించేది—మొక్కప్పుడే వంచాలన్న థియరీ రవణమ్మది. అంచేత చిన్నప్పుడు వాళ్లకు తగినశిక్షనిస్తే పెద్దయేక సంఘంలో గౌరవంగా బ్రతకగలరని ఆమె అభిప్రాయం. అందుకే వాడిని తగిన క్రమశిక్షణలో ఉంచడానికి పూనుకుంది. బడిలో మేష్టరుతోకూడా చెప్పమని భర్తతో చెప్పింది—'బాగా చదువుచెప్పాలనీ, అవసరమయితే రెండుదెబ్బలు కొట్టికూడా వాడిని సరిఅయిన క్రమశిక్షలో ఉంచాలనీ, ఎలాఅయినా ఓ

సంవత్సరంలో, ఓ పట్నవాసపు కుఱ్ఱాడికంటే మంచి తెలివయినవాడిగా తయారుచెయ్యాలనీ" చెప్పమంది.

ఆ చెప్పిన మాటలవను ఆసరాగా తీసుకొని, మేష్టరు చిట్టిబాబును చితక్కొట్టేవాడు, దయా దాక్షిణ్యాలు లేకుండా!—కొట్టి చదువుచెపితే పిల్లలు బాగుపడతారని తెలివితక్కువతనంగా పిల్లల గార్డియన్సు చెప్పొంటవచ్చు. అయితే మాత్రం?...తను ట్రయినింగ్ కాలంలో నేర్చుకున్న విషయాలన్నీ ఏమయినట్టు? వంశానుసరణి, పరిసరం, సహజాతాలు, సహజప్రజ్ఞ వీటిని తెలుసుకొని, తగిన పద్ధతులను నిర్ణయించుకొని బోధించాలనే జ్ఞానం ఆ మాష్టరి కుండక్కర్లే?...

ఆ విపరీత పద్ధతులూ, పరిసరం అవన్నీ చిట్టిబాబును మరింత మందమతివాడిలా తయారుచేసినయ్!...తన పల్లెటూరు, తన అన్నయ్య, వదినే మంచివాళ్ళని అనిపించింది. మళ్ళీ అక్కడికి పోవాలని బుద్ధి పుట్టింది కానీ ఎలా?....

ఎప్పుడూ ఏదో పరాకుగా ఉండేవాడు. ఏదయినా రాయమంటే, "అలాగే." అని అలా పలకపుల్లను పట్టుకొని నిర్ఘాంతపోయినట్లు కూర్చొనేవాడు. అలా ఊరికినే కూర్చున్నందుకు మేష్టరు కొట్టేవాడు పుస్తకాలూ, అవీ ఎక్కడో పారేసుకొనేవాడు. వాడి వైఖరి గమనించి కొందరు కుఱ్ఱాళ్లు, వాడి దగ్గరి వస్తువులు దొంగిలించేసేవారు—

ఇంటికొచ్చినతరువాత, "ఎక్కడ పారేసుకున్నావు, వెధవా!" అంటూ అక్కయ్య తిట్టి కొట్టేది "వాడన్నీ అందరకూ ఇచ్చేస్తూఉంటాడమ్మా" అని పంతులు కొంత కల్పించి చెప్పేవాడు. ఏడవడంతప్ప మరేమీ చెయ్యలేకపోయేడు చిట్టిబాబు.

ఓనాడు, బడిపంతులు—"మరి లాభం లేదండీ!...వట్టి మందమతి. ఎంత చెప్పినా రాదు వాడికి. ప్రత్యేకించి ప్రయివేటుపెట్టి చదువు చెప్పిస్తే కొంతమట్టుగ బాగుపడతాడు." అని వెంకట్రావుతో రోడ్డుమీద కలుసుకొని చెప్పేడు.

"వాడి మదర్ పోయినదగ్గరనుంచీ వాడి నిక్కడే ఉండనివ్వవలిసింది. కొన్నాళ్లు వాళ్ళ వదిన చేత ట్రయినింగ్ అయింది. ఈరకంగా వాడిని తయారుచేసింది. సహజంగా వాడు తెలివయినవాడే!" అని వెంకట్రావు ఉవాచ.

రవణమ్మకు కూడా అదే అనుమానం!—వదినే వాడికేదో మందు పెట్టి మతి పాడుచేసుంటుందని ఆమె అభిప్రాయం!...వాడిని మళ్ళీ ఎలా బాగుచేయ్యాలో అర్థమయిందికాదు రవణమ్మకు—ఇక రోజురోజుకీ ఎంచేతో ఎండిపోతున్నాడు కూడా!...ఏం చెయ్యడం? సహజంగా తన తమ్ముడు ఎంతో ఆరోగ్యంగా మంచి తెలివితేటలతో ఉండేవాడు. అమ్మ పోయినతరువాతే అలా తయారయేడు. అమ్మ పోయిన వెంటనే తను తీసుకెళిపోవలిసింది. అలా తీసుకెళిపొచ్చినట్లయితే ఈపాటికెంతో బాగుండేవాడనుకుంది. వదినను ఎన్ని తిట్లాలో అన్నీ తిట్టింది తన తమ్ముణ్ణి అలా చేసినందుకు. పోనీ, అన్నయ్యకేనా బుద్ధుండక్కర్లే, ఇలా తమ్ముణ్ణి తయారుచేస్తున్నప్పుడు చూస్తూ ఊరుకోడానికి?...అని రవణమ్మ అనుకుంది. ఏమయినాసరే తన తమ్ముణ్ణి తను మళ్ళీ బాగు చేసుకోడం తనవిధని అనుకుంది.

ఇకనుంచీ తమ్ముడికి ప్రయివేటు చెప్పిస్తూ ఉండాలని అనుకుంది. ఇలా తమ్ముడికి ప్రయివేటు చెప్పించ నిశ్చయించుకున్నట్లు, వాడు ఎండిపోతూ ఉండటంచేత ఓవల్టిన్ డబ్బాలుకొని పెట్టే అందుకూ డబ్బు ప్రతీనెలా పంపించమని అన్నయ్యకు ఉత్తరం రాసింది రవణమ్మ.

రవణమ్మ రాసిన ఉత్తరం అందిన తక్షణం ఓ ముప్ఫైరూపాయలు పంపించేశు. ప్రతీనెలా పదిహేను రూపాయల చొప్పున పంపిస్తూ ఉంటానని రాసేడు. పైగా, వదిన చిట్టిబాబుని చూడాలనుందని ప్రతీరోజూ అంటుంన్నాదనీ, అప్పుడప్పుడు నిద్దట్లో "చిట్టిబాబు" అని పలవరిస్తూ ఉంటుందనీ, తఱచు చిట్టిబాబు క్షేమసమాచారం గురించి ఉత్తరాలు వస్తుంటేనేగానీ వదినకు నిద్దరపట్టదనీ—ఉత్తరం రాసేడు శేఖరం.

డబ్బు పంపించినందుకు సంతోషించింది కానీ, ఉత్తరంలో వదినగురించి వ్రాసిన వర్ణనకు వళ్లు మండింది రవణమ్మకు. తేనెపూసిన కత్తి అదని అనుకుంది. వదిన నటన అర్థంకాక అన్నయ్య మోసపోతున్నాడని అన్నయ్యమీద జాలికలిగింది. అసలు చిట్టిబాబుని మెల్లగా ఈ లోకంలో లేకుండాచేస్తే అంత ఆస్తీ తమ ఒక్క కుటుంబానికే చెందుతుందని వదిని ఉద్దేశ్యమని రవణమ్మ భయం!...ఏమయినా సరే తమ్ముడు పెద్దవాడయే అంతవరకూ అక్కడకు పంపకూడదని నిశ్చయించుకుంది.

*　*　*　*

చిట్టిబాబు కోసమని ప్రయివేటుమాష్టర్ని ఒకర్ని నియమించింది రవణమ్మ. ఆ మేష్టరు ఎన్నో ప్రశ్నలడగ్గా అడగ్గా ఒక్క సమాధానం చెప్పేవాడు. ఆ జబాబయినా చాలా హీనస్వరంతో చెప్పేవాడు. గట్టిగా చెప్పమని ఇంట్లోంచి రవణమ్మ కేకలేసేది. ఆ కేకలతో అసలు చెప్పదలచుకున్న జబాబు

కూడా చెప్పేవాడు కాదు!...అక్కడితో ఆనాటి ప్రయివేటయిపోయేది.

సాయంవేళ అందరు పిల్లలూ మంచి చలాకీగా ఆడుకుంటూ ఉంటే, తనుమాత్రం చూస్తూ నిలబడే వాడు. "చక్కా పరుగెట్టి నువ్వూ ఆడుకోరా" అని అక్కయ్య అంటే అక్కడుండకుండా ఎటో వెళ్లి పోయేవాడు.

ఓనాటి సాయంత్రం బావ ఆఫీసునుంచి వస్తూ ఉంటే, మధ్యదారిలో ఆపి,—"నేను అన్నయ్య దగ్గర కెళిపోతాను" అని అన్నాడు ఏడుస్తూ.

"ఏం?" అని అడిగేడు వెంకట్రావు.

"అక్కయ్యకన్నా వదినే మంచిది. అంచేత వదిన దగ్గరకే వెళిపోతాను" అన్నాడు మరింత బిగ్గరగా ఏడుస్తూ.

"పల్లెటూరుపోయి ఏంచేస్తావురా? ఆవులను కాస్తా వేమిటి?" అని మొదట కొంచెం కఠినంగా అన్నాడు కానీ, మళ్లీ మనస్సు కరిగింది గాబోలు, "సరే, నువ్వెందు కక్కడికి వెళ్లడం, వాళ్లనే ఇక్కడకు రమ్మనమని ఉత్తరం రాస్తానులే!" అన్నాడు.

ఆ రాత్రి తమ్ముణ్ణి రమణమ్మ అడిగింది. "ఏంరా! నాకన్నా వదినే నీకు మంచిదా? వెధవా!...మొద్దువెధవా!..." అంటూ ఛళ్ ఛళ్ మని శరీరం కందిపోయేలా కొట్టింది.

అలా ఏడుస్తూనే అన్నం తినకుండానే పడుకున్నాడు చిట్టిబాబు. నిద్దట్లో కూడా వెక్కుతున్న తమ్ముణ్ణి చూచేసరికి ఆమె హృదయం కంపించి పోయింది. అలా వాడిని కొట్టినందుకు తనను తానే నిందించుకుంది. అలా వాడి మతిచెరిచేసినది వదినే అని అనుకుంది. అందులో వాడి తప్పేమీ లేదనే నిర్ధారణకు వచ్చింది. ఇకముం దెప్పుడూ అలా వాడిని కొట్టకూడదనుకుంది.

అనుకున్నట్లే మరి కొడదామనుకున్నా, కొట్టనివ్వబడని స్థితిలోకి వచ్చేడు చిట్టిబాబు. మర్నాటి ఉదయానికి చిట్టిబాబుకు వంటిమీద తెలివిలేదు. డాక్టర్ని తీసుగొచ్చేడు వెంకట్రావు. అప్పటికి నూటఐదు డిగ్రీల జ్వరం ఉంది. ఓ ఇంజక్షను ఇచ్చేసి మరేం ఫరవాలేదన్నాడు డాక్టరు.

మధ్యాహ్నం కొంచెం తెలివివచ్చినట్లయింది. ఏవో కొన్ని పరాకుమాటలన్నాడు చిట్టిబాబు— "ఉత్తరం రాసేరూ! నేనిక్కడుండను. కొట్టకు... కొట్టకు...అమ్మోయ్"అని ఈ రకంగా పరాకుమాటలు చాలా అన్నాడు.

ఆ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంచేత,— "ఉత్తరం వాళ్లకి రాస్తేనో" అన్నాడు వెంకట్రావు భార్యతో.

"ఎందుకూ? తగ్గిపోతుంది. వా డారోగ్యంగా ఉన్నాకే రాయొచ్చు" అంది రమణమ్మ పైకిమాత్రం. లోపల్లోపల భయం బాగానే ఉంది. తనేమో వాడిని మహా వదినకంటే, ఎక్కువగా బాగుచేద్దామనీ, ఆరోగ్యవంతునిగా చేద్దామనీ తీసుకొచ్చింది!... ఆఖరికి పరిస్థితి ఇలా తారుమారయిందేమా అని ఆమె హృదయం పీచుపీచుమంది. "తమ్ముడి జ్వరం తగ్గిపోయి హాయిగా ఉండా"లని అందరు దేముళ్లకూ దండాలు పెట్టింది.

కానీ, నాలుగోరోజు వచ్చేసరికి చిట్టిబాబు పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఉత్తరం కాదు, ఈమారు వైరే చేయవలిసొచ్చింది.

*   *   *   *

కామాక్షి, శేఖరం తొందర తొందరగా గదిలోకి ప్రవేశించేరు. చిట్టిబాబు తనలో తాను గొణుక్కుంటున్నాడు. "ఉత్తరం రాసేరా?" అని. "వచ్చేం నా...యి...నా!" అంది వదిన. చిట్టిబాబు ముఖంమీద ముఖం పెట్టి కన్నీరు కార్చింది.

ఆ మర్నాడు డాక్టరు పెన్సిలిన్ ఇంజెక్షను ఇవ్వడంచేత కొంచెం తెలివి వచ్చింది. వదిననూ, అన్నయ్యనూ గుర్తుపట్టేడు. "వదినా...అక్కయ్య కొ...ట్టిం...ది"అని వదిన కొంగులోకిదూరి వెక్కి వెక్కి ఏడ్చేడు. కొంచెంసేపయాక "నన్నూ పెద్ద ఆసు...ప...త్రి...కి..." అని మాత్రం అనగిలిగేడు వదినతో!....

"ఊహుం...నిన్నెక్కడికీ వెళ్లనియ్యను. నా దగ్గరే ఉంచుకుంటాను. నా చేతుల్లోంచి మరి నిన్నెవళ్లూ తీసుకెళ్లలేరు" అంటూ చిట్టిబాబుని హృదయానికి హత్తుకొని కన్నీరు కార్చింది కామాక్షి.

ప్రక్కనుండి ఇదంతా చూస్తున్న రమణమ్మ నిర్ఘాంతపోయింది. బొటబొటా కన్నీరు కార్చింది. అన్నాళ్లయి తమ్ముడిమీద తనకు అభిమానమే ఉంది కానీ వాత్సల్యం లేకపోయిందని గుర్తించింది. అందుచేత తమ్ముడిపట్ల తను మాతృశ్రీగా ప్రవర్తించలేకపోయిందని తెలుసుకుంది.

——